ప్రజాశక్తి
మంగళవారం 24 జనవరి 2023
5
విజయనగరం

జైభీమ్‌కు జాతీయ సమగ్రత పురస్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్‌కు జాతీయ సమగ్ర పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం హెల్త్ కేర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను సన్మానించారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ క్రీడలను ప్రోత్సహించేందుకు, పేదలను ఆదుకునేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించిన ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్‌ను నేషనల్ ఇంటిగ్రిటి అవార్డుతో సత్కరించారు. అవార్డు రావడంతో సమాజం పట్ల మరింత బాధ్యత పెరిగిందని జైభీమ్ అన్నారు.

పురస్కారం అందుకుంటున్న ఎస్ఇబి సిఐ జైభీమ్

నేడు శంబర సిరిమానోత్సవం

- 850 మందితో పోలీసు బందోబస్తు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, డిఐజి
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం

సిద్ధం చేసిన సిరిమాను

ప్రజాశక్తి -మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతగా పేరొందిన శంబర పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం సంబరం మంగళవారం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సినిమానోత్సవం ప్రారంభం కానుంది. జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సిరిమానును ఈ ఏడాది పూజారి జన్ని పేకాపు రామారావు అధిరోహించనున్నారు

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

పోలమాంబ అమ్మవారికి సోమవారం రాత్రి ఘనంగా తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని చదురు గుడి నుంచి పాల జంగడ ఘటాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం చావిడి వీధిలోని చదురుగుడి వద్ద అమ్మ వారిని ఉంచారు. గ్రామంలోని రైతులంతా ధాన్యం రాసిగా పోసిన తర్వాత అమ్మవారితో ఆ రాశులను తొక్కిస్తారు. ఆ తర్వాత గ్రామంలోని రైతులంతా వారు తెచ్చిన ధాన్యం ఇంటికి తీసుకెళ్లి భద్రపరచుకుంటారు. పంట పొలాల్లో వాటిని రైతులు చల్లుకొని వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. ఇలా చేస్తే రైతులకు మంచి జరుగుతుందని విశ్వసిస్తారు.

విశాఖ రేంజ్ డిఐజి సందర్శన

విశాఖరేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ అమ్మవారిని దర్శించుకొని జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జాతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. క్యూలైన్లను, సిరిమాను తిరిగే వీధులన్నింటినీ పరిశీలించారు. పోలీసు బందోబస్తును 700 నుంచి 850మందికి పెంచాలని సూచించారు. అలాగే ప్రసాదం కౌంటర్ వద్ద తొక్కిసలాట జరగకుండా ఎస్ఐ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలన్నారు. మన్యం జిల్లా ఏర్పడి మొట్టమొదటి సరిగా పెద్ద జాతర నిర్వహించడం ద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పోలీసు అధికారులకు సూచించారు. సిరిమాను సామర్థ్యం తదితర అంశాలపై ఇఒ రాధాకృష్ణ డిఐజికి వివరించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి దిలీప్ కిరణ్, ముగ్గురు డిఎస్‌పిలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఆర్‌డిఒ పర్యవేక్షణ

పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. శంబరలోని అన్ని వీధులను పరిశీలించారు. చెముడు గ్రామం వైపు వెళ్లేందుకు, వచ్చేందుకు భక్తులకు అనుకూలంగా ఉండేలా ఏర్పాటు చేసిన పైపులైన్ కాజ్‌వేను ఆమె పరిశీలించారు. అనంతరం సిసి కెమెరాల పుటేజులు పనితీరును, మెడికల్ క్యాంపులను పరిశీలించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రసాదాలను మన్యం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి పి.వెంకటరమణ పరిశీలించారు. అనంతరం నాణ్యతా ప్రమాణాలు, పోటులకు సంబంధించిన లైసెన్సు ధ్రువపత్రాన్ని ఇఒ రాధాకృష్ణకు అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా పరిశీలించారు. ఆహార పదార్థాల్లో ఏ విధమైన కల్తీ ఉన్నా సహించేది లేదని వ్యాపారులను హెచ్చరించారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఐజి హరికృష్ణ

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపి బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ : కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

కబడ్డీకి మరింత ప్రోత్సాహం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభంలో ఎంపి బెల్లాన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/నెల్లిమర్ల

విజయనగరం క్రీడలకు ప్రసిద్ధి అని, కబడ్డీ పితామహులు భగవాన్ దాస్ స్ఫూర్తితో క్రీడా అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 66వ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూలు మైదానంలో ఘనంగా ప్రారంభ మయ్యాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలను ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. వారి నుంచి గౌరవ అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, పారితోషికాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కబడ్డీని మరింత ప్రోత్సహించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ నాడు-నేడుతో పాఠశాలల స్థితి గతులు మార్చామన్నారు. విద్యా రంగాన్ని దేశంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత వైసిపి ప్రభుత్వానిది అన్నారు. విద్య, క్రీడలు రెండింటిలోనూ రాణించాలన్నారు. వల్లూరు శ్రీనివాసరావు వెయిట్ లిఫ్టింగ్‌లో మన నియోజకవర్గాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. అటువంటి స్ఫూర్తితో క్రీడాకారులంతా రాణించాలన్నారు. కబడ్డీ క్రీడ గురువు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇజ్జపురెడ్డి ప్రసాదరావు మాట్లాడుతూ త్వరలో మహిళా ప్రో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21 మంది బాల బాలికలకు 21రోజులు శిక్షణ ఇస్తే దానికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. అనంతరం పోటీలను ఎమ్మెల్యే అప్పలనాయుడు ప్రారంభించారు. తొలుత విజయనగరం- కర్నూలు బాలుర జట్లు మధ్య జరిగిన పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. పోటీలు ప్రారంభ సూచికగా ఎమ్మెల్యే, ఎంపి ఇతర ప్రజాప్రతినిధులు కబడ్డీ ఆడి అలరించారు. అనంతరం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలకు ముందు అలుగోలు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి అంబల్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారిక వైకుంఠం, పతివాడ సత్యన్నారాయణ, రైల్వే బోర్డు సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, గ్రామ సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, డిప్యూటీ డిఇఒ కంది వాసుదేవరావు, ఆర్‌ఐపి మనోహర్, టోర్నమెంట్ పరిశీలకులు తవిటమ్మ, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్ కౌశిక్, కాళ్ళ సూరిబాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సన్యాసిరాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్ వి రమణ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనాయుడు, సన్యాసినాయుడు, హైస్కూల్ హెచ్ఎం జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయుడు సూర్యారావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో గందరగోళం

- ఇన్‌ఛార్జి మార్పుతో ఎస్.కోటలో ముసలం
- విజయనగరం పార్లమెంటరీ మీటింగ్ ఎప్పుడో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎస్.కోట టిడిపి ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని తప్పించడంతో ఆ పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. టిడిపి విశాఖపట్నం పార్లమెంటరీ పార్టీ సమావేశం కేవలం ఆమెను తొలగించడానికే పెట్టారా? లేక పార్టీ ఆదేశం మేరకు విజయనగరం పార్లమెంటరీ మీటింగూ జరుగుతుందా? చాలా కాలంలో అసలు సమావేశాలే ఎందుకు జరగనట్టు? అంటూ టిడిపి నాయకులు, తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు. కేవలం ఆమెను తప్పించడానికే అక్కడ సమావేశం ఏర్పాచేశారని కూడా కొందరు నాయకులు భావిస్తున్నారు. ఈ సంగతి కాస్త పక్కనబెడితే.... గత ఎన్నికల్లో లలిత కుమారి ఆర్థికంగా ముందుకు సాగకపోవడం వల్లే విశాఖ ఎంపీ పదవికి ఎసరు వచ్చిందని, లేదంటే టిడిపి గెలిచేదని ఆ పార్టీలోని ఓ యువనేత అభియోగం మోపారట. ఈసారి అటువంటి పరిస్థితి ఏర్పడకుండా గొంప కృష్ణ అనే ఎన్ఆర్ఐని రంగంలోకి దింపారు. దీంతో, మనస్థాపానికి గురైన లలిత కుమారి సమావేశం నుంచి బయటకు వచ్చి చంద్రబాబు వద్ద తేల్చుకుంటామని చెప్పినట్టు సమాచారం. అనుకున్న ప్రకారం బాబు వద్ద లలిత కుమారి తను గోడు వెల్లగక్కారని కూడా ప్రచారం ఉంది. ఇన్‌ఛార్జులను మార్చినంత మాత్రన ప్రాధాన్యత తగ్గినట్టు కాదని, ఎన్నికలు వచ్చాక సీట్లు సంగతి ఆలోచిద్దామని చెప్పినట్టుగా సమాచారం. ఎస్.కోట నియోజకవర్గంలో వైసిపి బలంగా ఉన్నప్పటికీ బహునాయకత్వం ఉండడంతో ఎన్నికల వేళ ఎలాంటి ఇబ్బంది కలుగుతుందో అంటూ చాలా మంది రాజకీయ విశ్లేషకులు చెబుతూ వచ్చారు. నాయకుల మధ్య అంతర్గతంగా జరుగుతున్న కుమ్మలాటలు ఎన్నికల్లో టిడిపికి అనుకూలంగా మారే అవకాశాలు కూడా ఉన్నాయని పలువురు భావించారు. తాజా రాజకీయ పరిణామాలు టిడిపిలోనూ వేరే కుంపట్లకు దారితీయడంతో టిడిపి బలహీన పడుతుందని పలువురు అంచనా వేస్తున్నారు. ఇంకో పక్క నెల్లిమర్ల, రాజాం, గజపతినగరం నియోకవర్గాల్లో బహునాయకత్వం ఉంది. ఎన్నికల్లో పోటీకి కూడా సిద్ధపడుతున్నారు. వీరిని పార్టీ ఎప్పుడు ఎలా వెనక్కి తగ్గిస్తోందో? తగ్గిస్తే తగ్గుతారా? వైసిపి ఆఫర్లకు ప్లేట్లు ఫిరాయిస్తారా? వేచి చూడాల్సిందే అంటూ చర్చసాగుతోంది.

మిగులు ధాన్యాన్ని కొంటాం

ప్రాణ భద్రత కోసమే జిఒ 1 : జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం ఇప్పటి వరకు 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని, మిగిలి వున్న ధాన్యాన్ని కూడా తప్పని సరిగా కొనుగోలు చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సభలు, సమావేశాల్లో ప్రాణ భద్రత కల్పించేందుకే జిఒ నెంబర్ 1ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం జిల్లాలో 2.64లక్షలు, పార్వతీపురం జిల్లాలో 1.86 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ఈ ఏడాది మొత్తం 4.50లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాల్సి వుండగా 90శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని చెప్పారు. మునుపెన్నడూ లేనంతగా కొనుగోలు చేసిన 21రోజుల్లోపే బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. ఇంకా మిగిలివున్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉందన్నారు. అందులో భాగంగానే ప్రత్యేక యాప్‌ను రూపొందించి, కల్లాల్లో మిగిలి వున్న ధాన్యం నిల్వల ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు విజయనగరం జిల్లాలో 48వేల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి సిద్ధంగా ఉన్నట్టుగా యాప్‌లో అప్‌లోడ్ చేశామని స్పష్టం చేశారు. టిడిపి నాయకుడు లోకేష్ పాదయాత్రను ఎవరు అడ్డుకోవడం లేదని, అడ్డుకోవాల్సిన అవసరం కూడా ప్రభుత్వానికి లేదని అన్నారు. పాదయాత్ర వివరాలను డిజిపి కోరితే, అసలు పర్మిషనే తీసుకోమంటూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు చెప్పడం బాధ్యతా రాహిత్యమన్నారు. ఆయనకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లే అలా మాట్లాడుతున్నారని అన్నారు. అచ్చెన్నాయుడి మాటలను తాను పూర్తి ఖండిస్తున్నానని చెప్పారు. జగన్ పాదయాత్రతో లోకేష్ పాదయాత్రను పోల్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా జనం సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టారని, అప్పట్లో ప్రతి జిల్లాలోనూ పాదయాత్ర జరిగిన దారి, సభలు నిర్వహించే ప్రాంతాలను స్పష్టంగా తెలియజేసామని పేర్కొన్నారు. లోకేష్ విషయంలోనూ పోలీసులు అటువంటి క్లారిటీ అడుగుతున్నారని అన్నారు.

స్పందనకు 221 వినతులు

పెండింగ్ లేకుండా పరిష్కరించాలి : కలెక్టర్

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వ్యకాస నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వినతుల కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 221 వినతులు అందాయి.. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయి. కలెక్టర్ ఎ. సూర్యకుమారి, డిఆర్ఓ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. స్పందన లో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువు లోగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

రేగపుణ్యగిరి గిరిజనుల భూమికి పట్టాలివ్వాలి

ఎస్.కోట మండలం రేగ పుణ్యగిరిలో గత 50 ఏళ్లుగా గిరిజనులు సాగుచేస్తున్న భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాడి అప్పారావు, జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 310 మంది గిరిజనులు 50 ఏళ్ళ గా అటవీ భూమిని సాగు చేస్తున్నారని. వీరికి నేటికీ పట్టాలు మంజూరు చేయక పోవడం దుర్మార్గమని అన్నారు. 52 మందికి పట్టాలిచ్చి మిగతా వీరికి ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పడం అన్యాయమన్నారు. వెంటనే మిగతా వారికీ కూడా పట్టాలివ్వాలని కోరారు.

గ్రామాభివృద్ధికి తోడ్పడండి

విజయనగరం మండలం ద్వారపూడి గ్రామ పంచాయతీలో తీర్మానించిన అభివృద్ధి పనుల అమలు పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, సమస్యను పరిష్కరించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని గ్రామ సర్పంచ్ యజ్జల ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. గ్రామంలో సిసి కాలువ నిర్మాణానికి సభ్యులంతా ఆమోదించి తీర్మానం చేసినా, నేటివరకు దాన్ని అమలు చేయలేదని తెలిపారు. రెండేళ్లుగా పంచాయతీ ఖాతాలో నిధులు నిరుపయోగంగా ఉన్నా అభివృద్ధి పనులు మాత్రం చేపట్టలేదన్నారు.

పిసిపిఎన్‌డిటి చట్టానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ రమణకుమారి, తదితరులు

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

- డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి
- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, ఈ నేరానికి పాల్పడిన వారికి పిసిపిఎన్‌డిటి యాక్ట్-1994 ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తున్నట్లు డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి చెప్పారు. రెండోసారి కూడా ఈ నేరం చేసినవారికి ఐదేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేయడమే కాకుండా, చేయాలని అడగడం కూడా నేరమేనని ఆమె స్పష్టం చేశారు. జాతీయ బాలికల దినోత్సవం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పైనా, లింగ వివక్షత నిర్మూలనపైనా అవగాహన కల్పించారు. డిఎంహెచ్ఒ రమణకుమారి మాట్లాడుతూ లింగ వివక్షతను రూపుమాపాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. సాధారణంగా పిండం వయసు మూడు నెలలు దాటే వరకు లింగ నిర్ధారణ చేయడం అంత సులువు కాదని అన్నారు. మూడు నెలల తరువాత గర్భస్రావం చేయించడం, తల్లి ప్రాణాలకు చాలా ప్రమాదమని చెప్పారు. అయినప్పటికీ లింగ నిర్ధారణా పరీక్షలను అన్ని స్థాయిల్లో అరికట్టాల్సి ఉందని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టి, సమాచారం అందించాలని కోరారు.

దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేషు మాట్లాడుతూ ప్రజల దృక్పథంలో మార్పు వచ్చినప్పుడే లింగ వివక్షత రూపుమాపుతుందని అన్నారు. నేటి తరం ఆ దిశగా ఆలోచించాలని కోరారు. స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉండటమే శ్రేయస్కరమని అన్నారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ప్రభాకరరావు, పిసి పిఅండ్ డిటి రాష్ట్రకమిటీ సభ్యులు చదలవాడ ప్రసాద్, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ మాట్లాడారు. ఈ సందర్భంగా పిసిపిఎన్‌డిటి చట్టానికి సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించారు.

లా కాలేజిని నడిపించాలి

డిఆర్‌ఒకు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో విద్యార్థులకు న్యాయ విద్యను అందిస్తున్న మహారాజా లా కళాశాల మూసివేతను ఖండిస్తూ, కళాశాల తెరిపించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిఆర్ఒ గణపతిరావుకు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులకు న్యాయ విద్య అందించడమే లక్ష్యంగా నెలకొల్పిన లా కలాశాల నేడు ఫీజులు సరిపోవటం లేదని, కళాశాల నిర్వహణ కష్టంగా మారిందని సాకులు చూపుతూ ఉన్నఫలంగా మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఆపివేయడం సరైనది కాదని అన్నారు.

ఇప్పటికే కళాశాలలో రెండు, మూడవ సంవత్సర విద్యార్థులు దాదాపు 200 మంది చదువుకుంటున్నారని, మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న 120 సీట్లను కళాశాల యాజమాన్యం కౌన్సిలింగ్ లో ఉంచకుండా కళాశాల మూసివేతే పరమావధిగా అడుగులు వేస్తుందని అన్నారు. యాజమాన్యం ఖాళీగా ఉన్న 120 సీట్లను భర్తీ చేయాలని మొదటి సంవత్సర విద్యార్థులకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని దీనికి ప్రభుత్వం కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

31న జిల్లా సమీక్ష సమావేశం

విజయనగరం : కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఈనెల 31న జిల్లా ఇన్ ఛార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం జరుగుతుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ధాన్యం సేకరణ, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్యం, తాగునీటి సరఫరా, సంక్షేమ పథకాలు - డిఆర్‌డిఎ, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, మహిళా శిశు సంక్షేమ, ఉపాధిహామీ, జలవనరులు, విద్య, గడపగడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై ఈసమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహనకు సెల్ఫీ పాయింట్

విజయనగరం : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ కలెక్టరేట్ సమీపంలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల కూడలి వద్ద ప్రత్యేక సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. సోమవారం కలెక్టర్ సూర్యకుమారి మొదటి ఫొటో తీసుకుని సెల్ఫీ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కమిషనర్ ప్రసాదరావు, తహశీల్దారు బంగార్రాజు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదుపై సూపర్ చెకింగ్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-బొండపల్లి, గంట్యాడ

పంట భూములకు సంబంధించి చేసిన ఇ-క్రాప్ నమోదుపై జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి బొండపల్లిలో సూపర్ చెకింగ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం బొండపల్లి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన ఆమె స్థానిక రైతుల సమక్షంలో అధికారులను ఆరా తీశారు. ఇ-క్రాప్ నమోదు, ధాన్యం కొనుగోలు, ఇతర సేవలపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రభుత్వం, అధికారుల నుంచి అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా కొన్నిచోట్ల మిగులు ధాన్యం ఉండిపోయిందని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. ప్రత్యేక యాప్ ద్వారా రైతుల నుంచి వివరాలు సేకరించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదులిచ్చారు. బొండపల్లి పరిధిలో ఇప్పటి వరకు జరిగిన ఇ-క్రాప్ బుకింగ్, రైతుల నుంచి సేకరించిన ధాన్యం గురించి రైతుల సమక్షంలోనే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సీజన్‌కు ముందుగానే స్థానిక పరిస్థితులకు, వాతావరణానికి అనువైన ఇతర ప్రత్యామ్నాయ పంటలను అనుసరించేలా రైతులను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు కూడా అధికారులకు, సిబ్బందికి తగిన విధంగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సాధారణ రకాల విత్తనాలను కాకుండా నాణ్యమైన కొత్తరకం వంగడాలను వినియోగించాలని, పంటల మార్పిడిపై రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఆమె వెంట స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, వ్యవసాయ అధికారి మల్లిఖార్జున, స్థానిక అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

సచివాలయ సేవలను మరింత విస్తృతం చేయాలి

సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని సిబ్బందిని కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. సమయపాలన పాటించి ప్రజలకు అనుకూల సమయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. బొండపల్లి మండలంలోని కొత్తపాలెం, గంట్యాడ మండల పరిధిలోని పెదమజ్జిపాలెం గ్రామ సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు, ప్రగతి నివేదికలను పరిశీలించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయ వెలుపల బిఎల్ఒల ఫోన్ నంబర్లు, ఇతర వివరాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తపాలెంలో ఆర్ఒ ప్లాంటు లేకపోవడాన్ని, పాఠశాల కమిటీ ఏర్పాటు కాకపోవటాన్ని గమనించి కలెక్టర్ సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో ఫోన్లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా పని సులువుగా అయ్యేందుకు వీలుగా సంబంధిత సర్వేయర్లకు ల్యాప్‌ట్యాప్‌లను అందజేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట బొండపల్లి ఎంపిడిఒ వేదవతి, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

లేఅవుట్ కొలతలపై నివేదిక ఇవ్వండి

అధికారులను ఆదేశించిన ఆర్‌డిఒ ● ప్రయివేటు స్థలం, గెడ్డలోంచి రోడ్డు వేయడంపై ఆగ్రహం

ప్రజాశక్తి-కొత్తవలస

దెందేరు జగనన్న కాలనీలో ప్రస్తుతం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల కొలతలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆర్‌డిఒ ఎం.సూర్యకళ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామస్తుల ఫిర్యాదుమేరకు సోమవారం మండలంలోని దెందేరు గ్రామంలో జగనన్న కాలనీని ఆమె సందర్శించారు. గ్రామస్తులు, రైతులు, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందజేసిన 60 గజాల కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి స్థానిక నాయకుల అండతో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారనే అంశాలు ఆర్‌డిఒ దృష్టికి రావడంతో వెంటనే కొలతలపై నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. దెందేరు జగనన్న కాలనీకి ప్రత్యామ్నాయ రహదారిగా రైతు బొబ్బిలి కొండబాబుకు చెందిన సర్వే నంబరు 63లో సుమారు 24 సెంట్ల జిరాయితీ భూమితోపాటు గెడ్డలోంచి ఎలా రోడ్డును వేశారంటూ పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ సిబ్బందిని ఆర్‌డిఒ ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపులేమైనా జరిగాయా? అని ఆరాతీశారు.

ఈ లేఅవుట్ ప్రారంభంలో సంతపాలెం రోడ్డు నుంచి అప్పటి రెవెన్యూ సిబ్బంది ప్రధాన మార్గంగా చూపించారని గ్రామస్తులు తెలిపారు. ప్రయివేటు స్థలం నుంచి స్నేహపూర్వకంగా రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. సుమారు 150 ఎకరాల ఆయకట్టు రైతులకు నష్టం వాటిల్లే విధంగా గెడ్డను కప్పి రోడ్డు వేశారని రైతులు విన్నవించారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ వై.పద్మజ, హౌసింగ్ ఎఇ రామప్రసాద్, ఆర్ఐ కిశోర్, విఆర్‌ఒ ఆదినారాయణ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దెందేరు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

పారదర్శకంగా పథకాల అమలు



బొబ్బిలి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని 14వ వార్డు అప్పయ్యపేట గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి, కౌన్సిలర్ సిరావు శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, ఇంటి గోపాలరావు, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేగిడి : పేద, బడుగు, బలహీనవర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసే ఘనత వైసిపిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు స్పష్టం చేశారు. ఆర్ ఆముదాలవలస కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల పుస్తకాలను ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసే విధంగా వైకాపా ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, వైసిపి నాయకులు నెల్లి పెంటన్నాయుడు, కెంబూరు వెంకటేశ్వరరావు, పాలవలస రామ చంద్ర నాయుడు, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

ప్రజాశక్తి-వేపాడ

జిల్లా వ్యాప్తంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేపాడలో నేతాజీ విగ్రహానికి తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్ రహిమాన్, ఎం.బంగారు నాయుడు, చప్ప దేవుడు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దామోదర శ్రీధర్.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్వామి వివేకానంద పాఠశాలలో కరస్పాండెంట్ బెహరా పురుషోత్తమరావు, ప్రిన్సిపల్ ఇల్లపు ప్రసాద్ ఆధ్వర్యంలో నేతాజీకి నివాళులర్పించారు.

శృంగరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు అంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు, వైస్ ప్రిన్సిపల్ రమేష్ కుమార్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ సివిఎస్ రవీంద్రనాథ్, అధ్యాపకులు షేక్ వలీఖాన్, రేచర్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : నారాయణప్పవలస పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జెసి రాజు ఆధ్వర్యాన నేతాజి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భానుప్రకాష్ మహేష్ లు పాల్గొన్నారు.

విజయనగరం కోట : సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అలకానంద కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, నాలుగెస్సలు రాజు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి బాలాజీ పాల్గొన్నారు. రక్త సేకరణ నిరంతర రక్తదాత బొడ్డేపల్లి రామకృష్ణారావు తన పుట్టిన రోజును పురస్కరించుకొని 173వ సారి రక్త దానం చేశారు. గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూలులో చంద్రబోస్ చిత్రపటానికి శ్రీనివాస వాట్సాప్ అకాడమీ కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు, స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయనగరంకోట.. శిబిరంలో రక్తదానం చేస్తున్న వ్యక్తి

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి జాతీయ క్యాదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను సోమవారం అశోక్‌బంగ్లాలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు తదితరులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పేర్ల వారి వీధిలో గల చెవిటి మూగ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులను ఏడాది పాటు దత్తత తీసుకొని వారిని చదవించే బాధ్యతను పార్టీ నాయకులు తీసుకున్నారు. ఇందు కోసం ఒక్కో విద్యార్థికి రూ. 6వేలు చొప్పున మొత్తం రూ.42వేలను యాజమాన్యానికి అందించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారుబాబు, మండల అధ్యక్షులు నర్సింగరావు, కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు యువత, టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్వర్యంలో పైడితల్లి అమ్మవారి దేవాలయం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేమలి చైతన్య బాబు, గొలగాన సురేంద్ర, టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి మాడుగుల భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో రామతీర్థంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, బొంతు రమణ, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, రెడ్డి వేణు, తాడ్డి సత్యనారాయణ, గురాన అసిరినాయుడు, నల్లం శ్రీనివాసరావు, చింతపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో అక్కివరం పరమేశ్వర ఆలయం వద్ద అభిషేకం చేయించారు.

నెల్లిమర్ల.. కొబ్బరికాయలు కొడుతున్న మాజీమంత్రి పతివాడ, టిడిపి నాయకులు

పూసపాటిరేగ : మండలంలో పేరాపురంలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, ఆకిరి ప్రసాదరావు, విక్రం జగన్నాథం, పతివాడ తమ్మునాయుడు, బొంతు అప్పలనాయుడు, బొంతు రవి, బొంతు ఉమా, పిన్నింటి సన్యాసినాయుడు, యిజ్జురౌతు ఈశ్వరరావు, ముత్యాల వెంకటరమణ, పిళ్లా లక్ష్మినారాయణ, కూనిశెట్టి గోవిందరావు, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పిన్నింటి కిషోర్, కొత్తకోట బాలకృష్ణ, చందక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామ చంద్రుడు, వెన్నె సన్యాసి నాయుడు, తిరుమల రాజు కిరణ్ కుమార్ రాజు, చనమల మహేశ్వర రావు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, కెంగువ ధనుంజయ, అరతి సాహు, వెంపడాపు రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ పాఠశాలకు రూ.20వేలు విరాళం

భోగాపురం : వికలాంగ పాఠశాలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారురాజు రూ. 20వేలు విరాళాన్ని అందించారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పేరు మీద ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. అంతకుముందు భోగాపురం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రోతు రాజు, దాసరి అప్పలస్వామి, నీలపు అప్పలరామిరెడ్డి, కోరాడ తాతారావు పిడుగు తోటరావ్, పసుపులేటి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి చేయూత

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

నగరంలో రౌండ్ టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల భవన నిర్మాణాలకు ముందుకు రావడం అభినందనీయమని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. సోమవారం స్థానిక 12వ డివిజన్ బుంగవీధిలో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో అనేక ప్రాంతాలలో రౌండ్ టేబుల్ సంస్థ పాఠశాల భవన నిర్మాణాలను చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యతిస్తున్నారన్నారు. రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ రవి వర్మ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు అవసరమైన పాఠశాల భవన నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. బూడివీధిలో 16 లక్షల రూపాయలతో రెండు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం అక్కడ ఉన్న మరో పాఠశాల ను మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రేవతి దేవి తదితరులు సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపా దేవి, వైసిపి నాయకులు కాళ్ల సూరిబాబు, బొంగ భాను మూర్తి, రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు సత్యదేవ్, వినీత్, అవినాష్, విరన్ రెడ్డి, సతీష్, భావన తదితరులు పాల్గొన్నారు

సచివాలయంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజావక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామ సచివాలయంలో సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పంచాయతీ ఆదాయ వనరులపై ఆరాతీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులుగా అప్పలనాయుడు

ప్రజాశక్తి- డెంకాడ

విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎం.అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆధ్వర్యంలో విజయనగరంలో ఆ సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎన్నికల్లో విఆర్‌ఒలందరూ కలిపి అప్పలనాయుడను అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పలనాయుడు డెంకాడ మండలం అమకం విఆర్‌ఒగా పని చేస్తున్నాడు. అతనికి పలువురు అధికారులు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

దేశంలో యువతకు అన్ని రంగాల్లో తమ ప్రతిభకు సరిపోయే అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందుకోవడానికి యువత సిద్ధం కావాలని జిల్లా పోలీసు ట్రైనింగ్ కళాశాల ఎస్‌పి ఆనందబాబు అన్నారు. నగరంలోని గుంటూరు సుజాత విద్యాసంస్థల ఆధ్వర్యంలో బెస్ట్ జూనియర్ కళాశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల టాలెంట్ పరీక్షల నిర్వహణ బహుమతి ప్రదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఏ రంగంలోనైనా విజయం సాధించించాలంటే కృషి, పట్టుదలతో విద్యార్థులు అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వెయ్యాలని అన్నారు. విజయం సాధించే వరకు సినిమా, సెల్‌ఫోన్లు, సీరియళ్లు కి దూరంగా ఉండాలని అన్నారు. చదువు మనిషి జీవితానికి పెద్ద ఆభరణమని హితవు పలికారు. జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా సామాజిక బాధ్యతను మరచిపోకూడదని అన్నారు. టాలెంట్ టెస్ట్ లో ప్రథమ బహుమతి పొందిన కె.భరత్ చంద్ర (నారాయణ ఈ టెక్నో)కి పది వేల రూపాయలు, గోల్డ్ మెడల్, ద్వితీయ బహుమతి పొందిన అల్లు పవన్ కుమార్(జెడ్‌పి హైస్కూలు, గంట్యాడ)కు రూ.7500, సిల్వర్ మెడల్ , తృతీయ బహుమతి పొందిన వి.గాయత్రి (జెడ్‌పి హైస్కూలు, మరడాం)కు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు.కార్యక్రమంలో విద్యార్థుల మనోవికాస నిపుణులు అన్వర్ కాలేజి డైరెక్టర్ బిఎ రావు, కాలేజీ ప్రిన్సిపాల్స్ విజయ్, పైడిరాజు, అనిల్, ఉమామహేశ్వర్ గీతాంజలి విద్యాసంస్థల అధినేత శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు హెల్ప్‌లైన్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 37వ వార్డు సచివాలయంలో హెల్ప్ ఏజ్ ఇండియా వారి ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు హెల్ప్ లైన్ నెంబర్ 14567 పై స్టేట్ టీమ్ లీడర్ శంకరనారాయణ అవగాహన కల్పించారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేసి వృద్ధుల సమస్యలు, వృద్ధాశ్రమాలు, సంరక్షణ కేంద్రాలు, హాస్పిటల్స్ మరిన్ని వివరాల కోసం సమాచారం అందిస్తామని తెలిపారు. పెన్షన్ మరియు చట్టపరమైన సమస్యలపై సలహాలు,సూచనలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ జి. సింహాచలం, వార్డు కార్యదర్శి అనూప్ కుమార్, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మజ పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మొయిద జంక్షన్‌లో జనసేన నియోజకవర్గం ఇంఛార్జి లోకం మాధవి ఆ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ మరింత పటిష్ట పర్చడానికి కృషి చేస్తామన్నారు. అధికార వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి జనసేన చైతన్య పరుస్తుందని పేర్కొన్నారు. జనసేన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులకు గిట్టుబాటు ధర, అధునాతన పద్ధతులు, పండించిన పంట నిల్వచేసు కోవడానికి గిడ్డంగులు ఏర్పాటు చేసి అండగా నిలుస్తాదని చెప్పారు. పార్టీ అధికారంలోకి వస్తే మత్స్య కారులకు జెట్టీ నిర్మాణం, పరిశ్రమలు నెలకొల్పి కార్మిక వర్గానికి చేయూత నివ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జనసేన తగిన ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, పార్టీ నిర్వహణ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని వల్లూరుకు చెందిన పేదలకు సోమవారం ఎంపిపి అంబళ్ల సుధారాణి చేతులు మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబెర్ అంబల్ల శ్రీరాములునాయుడు, తహశీల్దార్ రాజు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, వల్లూరు గ్రామ రెవెన్యూ అధికారి కోమలి, ఎంపిటిసి లంక సన్యాసిరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాంబమూర్తి తీర్థం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో జంట గ్రామాలైన వల్లంపూడి, వేపాడలో సాంబమూర్తి తీర్థం మంగళవారం ప్రారంభం కానుంది. తీర్థం సందర్భంగా ఆయా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, ఎడ్ల పరుగు, తదితర పోటీలు నిర్వహిస్తున్నారు.

శ్రీను కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కాటపల్లి శ్రీను అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. దీంతో ఆ కుటుంబానికి సోమవారం తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ బుద్ధ చిన్నమ్ములు, నాయకులు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు అందజేశారు.

శ్రీను కుటుంబానికి నగదు అందిస్తున్న నాయకులు

నిరుపేద కుటుంబాలకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేద కుటుంబాలకు యూత్ ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర వస్తువులు సోమవారం అందచేశారు. విజయనగరం బిసి కాలనీకి చెందిన 66 ఏళ్ల మానాపురం సావిత్రమ్మ ఆర్థిక ఇబ్బందులతో జీవనం గడుపుతుంది. వచ్చిన పెన్షన్ తో మందులు కొనుక్కుంటూ ఇబ్బంది పడుతుంది. ఆమె కుమారుడు శ్రీను నరాల బలహీనత వ్యాధితో మంచం మీద లేవలేని స్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో సావిత్రమ్మతో పాటు ఎస్. కోట మండలం ధర్మవరం ఎస్‌సి కాలనీకి చెందిన ఆకేటి జానకమ్మ కుటుంబానికి విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామష్, జాప్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గొర్లె సూరిబాబు, జర్నలిస్ట్ పల్ల శివ, సంస్థ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్ శరత్, రాము, విజయ్, కళ్యాణ్,వినయ్, వంశీ,వికాస్, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు
ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వ్యాసరచనలో ఎస్.హరిణి, వై.మానస ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో ఎన్.వర్షిణి, చిత్రలేఖనంలో డి.చంద్రశేఖర్, కె.పావనిప్రియ సత్తాచాటారు. వీరిని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

సత్తాచాటిన శ్రీరామ్ కాలేజీ విద్యార్థి

ప్రజాశక్తి- గరివిడి

అండర్19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్, ఫుట్ బాల్‌లో శ్రీ రామ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు సిహెచ్ విశాలాక్షి, ఎం. రోహిణి, బి. అఖిల్, వై.అభిరామ్, ఎస్.సురేష్, పి. సాయిరాం సత్తా చాటారు. ఈ నెల 22న రాజీవ్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొని సత్తా చాటారు. వీరంతా జాతీయ స్థాయిలో భీమవరం, తిరుపతిలో జరగనున్న క్రీడల్లో పాల్గొని ఆడనున్నారు. వీరిని కళాశాల సెక్రటరీ టి.కమలాకర్రావు, బి. రవి, ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, పీడీ భాను మూర్తి అభినందించారు.

కరాటే పోటీల బ్రోచర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఫిబ్రవరి ఏడో తేదిన నిర్వహించే కరాటే సెమినార్, బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామినేషన్‌కు సంబంధించిన కరాటే బ్రోచర్లను సోమవారం కరాటే విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విక్టరీ షూటోకాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామినేషన్‌కు అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆర్.మల్లికార్జునగౌడ్, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, సిఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్ఐ ఎం.ముకుందరావు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రముఖ సినీనటుడు సుమన్ కూడా హాజరయ్యే అవకాశముందని చెప్పారు.

ఆస్తి పన్ను వసూలు ముమ్మరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి కమిషనర్ ఆర్. శ్రీ రాములునాయుడు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 -23 ఆర్థిక సంవత్సరానికి గాను 43.40 కోట్ల రూపాయలు ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు రూ.22 కోట్లు వసూలు చేశామన్నారు. మార్చి నెలాఖరులోగా రూ.21 కోట్లు వసూలు లక్ష్యం కాగా సాధ్యమైనంత ఎక్కువ శాతాన్ని వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.24.80 కోట్ల పన్నును వసూలు చేశామన్నారు. మొండి బకాయిలు చెల్లింపులలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 2023- 24 ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందుగా గత ఆర్థిక సంవత్సరపు పన్ను వసూళ్ళ లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదన్ రావు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీరావు సూచించారు. సోమ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరకు 70శాతం, వచ్చే నెలాఖరుకు శత శాతం ఇంటి పన్ను వసూళ్ల పూర్తి చేయాలని సూచించారు. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు సక్రమంగా నిర్వహించి పంచాయతీలకు ఆదాయాన్ని పెంచాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు సమస్యను విన్నవిస్తున్న సిపిఎం నాయకులు శంకరరావు

సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములపై వారికే పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పి.శంకరరావు మాట్లాడుతూ రామభద్రపురం మండలం గొల్లలపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 210లో ఎకరా భూమిని పువ్వల తిరుపతిరావు 30 ఏళ్ల నుండి సాగు చేసుకొంటున్నారని, నేటికీ పట్టా మంజూరు చేయలేదని తెలిపారు. ఇదే సర్వే నెంబర్‌లో 11 ఎకరాలు ఒక రిటైర్డ్ ఉద్యోగికి మూడు బినామీ పేర్లతో రికార్డుల్లో చేయించుకొని కబ్జా చేశారని తెలిపారు. గొల్లలపేట పంచాయతీ పరిధిలో సెంటు భూమి లేని నిరుపేదలు ఉన్నారని, వారిని గుర్తించి పంపిణీ చెయ్యాలని ఆర్‌డిఒ పి.శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం రామభద్రపురం మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు, గ్రామస్తులు పి.తిరుపతిరావు, సి.హెచ్.కృష్ణవేణి, పి.అడివమ్మ, పి.గంగమ్మ, సి.హెచ్.పారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాసాపేటలో పశువులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కాసాపేట పంచాయతీలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 35 పశువులకు పశువైద్యాధికారి కోరాడ గాయత్రి సేవలందించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా వైద్యం అందించినట్లు ఆమె తెలిపారు. అనంతరం రైతులకు ఆడదూడల ఉత్పత్తి పథకం , పశుగ్రాస పెంపకం ప్రాముఖ్యత, చలికాలంలో పశుపోషణ కోసం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు లక్కవరపుకోట మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్తు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.రూపేష్ ఒక తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులతో పాటు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జెడ్‌పి చైర్మన్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని లింగాలవలస మెట్టపై నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 5వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైసిపి ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లుబోయిన నర్సింగరావు, పడాల భాను ప్రకాష్, సుందర హరీష్, కర్రోతు శ్రీనివాసరావు, పైడినాయుడు పాల్గొన్నారు.

మరిది వేధింపులు తట్టుకోలేక
వితంతువు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బొబ్బిలి

మరిది వేధింపులు తట్టుకోలేక ఓ వితంతువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని నారాయణప్పవలస గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నారాయణప్పవలస గ్రామానికి చెందిన దాసరి రామలక్ష్మి భర్త పైడపునాయుడు రెండేళ్ల క్రితం మరణించాడు. అప్పటి నుంచి ఆమె కుమార్తె కళతో కలిసి జీవనం సాగిస్తోంది. మరిది సత్యనారాయణ లైంగికంగా వేధిస్తున్నట్లు సంక్రాంతికి ముందు పోలీసుస్టేషన్లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో నేరం రుజువు కాకపోవడంతో చర్యలు తీసుకోలేదు. దీంతో సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఆమె పురుగులమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే పోటీల్లో పవన్ తేజ్ ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం

ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కోల్‌కత్తాలో జరిగిన కరాటే పోటీల్లో తోటపాలేనికి చెందిన ఆర్లె పవన్‌తేజ్ ద్వితీయ స్థానం సాధించాడు. పవన్ తేజ్ నగరంలోని నారాయణ స్కూల్లో పాఠశాలలో నాలుగో తరగతి చదువు తున్నాడు. టికెఇడబ్ల్యుఎ తరపున ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ట్రోఫీతో పవన్ తేజ్